క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఎంతో సారవంతం అవుతుందని ఏఓ కె.రామసుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయం జగ్గయ్యపేట డివిజన్ మాస్టర్ ట్రైనర్ వన్నూరప్ప పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం, రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వీఏఏ, వీహెచ్ఏలకు బుధవారం శిక్షణనిచ్చారు. వారితో కలిసి క్షేత్రస్థాయి పరిశీ లన చేశారు. ఘన జీవామృతం, ద్రవ జీవా మృతం, బీజామృతం తయారీని వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం అసోసియేటర్ రాజశ్రీ, ఏఈఓ గింజుపల్లి శ్రీనివాసరావు, మూడు మండలాల వ్యవసాయ శా ఖ, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విజన్-2047పై సమీక్ష



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్- 2047పై నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాలాజీకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విజన్ 2047ను ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అన్ని శాఖల అధికారులు ఆయా శాఖల వారీగా ముందస్తు ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పీ4 పై మార్గదర్శులను గుర్తించాలని సూచించారు. ఎంపీడీవో నితిన్, వైద్యాధికారి అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ పీఆర్ డీఈ శ్రీనివాసరావు, అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కంచికచర్ల : ద్విచక్రం నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ బోనగిరి రాజు సూచించారు. లేని పక్షంలో జరిమానా విధిస్తామని హెచ్చరించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని 14మంది వాహనచోదకులకు కలిపి రూ.10వేలు జరిమానా విధించారు.

అన్నదాన పథకానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం తెలంగాణ రాష్ట్రం మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లి మండలం మల్లంపేట గ్రామానికి చెందిన దాములూరి రమేష్, మాధవిలత దంపతులు రూ.51,000 విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ ఇన్‌స్పెక్టర్ మన్నెం నరసింహారావు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

తగ్గుముఖం పట్టిన మునేరు

కంచికచర్ల: మండలంలో కీసర వద్ద మునేరు ప్రవాహ ఉధృతి బుధవారం తగ్గుముఖం పట్టింది. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మునేరుకు భారీగా వరదనీరు చేరింది. మునేరుకు వరదనీరు తగ్గిందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. అయితే వారంరోజుల కిందట మునేరులో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన వీరులపాడు మండలం తాటిగుమ్మి గ్రామానికి చెందిన వ్యక్తి నాగార్జున తిరుపతిరావు ఆచూకీ మాత్రం నేటికీ లభించలేదు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :ఆర్డీవో

నందిగామరూరల్: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి దిగువకు వరద నీరు వస్తున్నందున కృష్ణానది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ బుధవారం సూచించారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజీకి వరద నీరు భారీగా వస్తోందన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులు తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

యూనిఫాం పంపిణీ

నందిగామటౌన్: మున్సిపల్ కార్మికులు, నాలుగో తరగతి సిబ్బందికి మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు బుధవారం రాత్రి యూనీఫాం, కొబ్బరినూనె, సబ్బులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో సిబ్బందికి కిట్‌లను పంపిణీ చేశామన్నారు. సచివాలయ కార్యదర్శులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తికాని ఎత్తిపోతల పథకం పనులు

- తొమ్మిదేళ్లుగా సాగుతున్న తక్కెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు..
- ఇంకా 25శాతం పనులు పెండింగ్
- చెక్‌డ్యాం లేకపోవడంతో నీరు నిల్వ ఉండని దుస్థితి
- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపులు



చెక్ డ్యాం నిర్మించకపోవడంతో పాలేరులో తక్కువగా ఉన్న నీరు



నిరుపయోగంగా ఉన్న మోటార్లు



పాలేరు ఒడ్డున తలపెట్టిన తక్కెళ్ళపాడు ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్



పొలాలకు నీరు అందించేందుకు నిర్మించిన డెలివరీ బావి

జగ్గయ్యపేట: సాగునీటి ప్రాజెక్ట్‌ల నిర్మాణం విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం రైతుల పాలిట శాపంగా మారుతుంది. జిల్లాలోని జగ్గయ్యపేట మండలం తక్కెళ్ళపాడులో పాలేరు ఒడ్డున తలపెట్టిన ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు తొమ్మిదేళ్లుగా పూర్తిగాకపోవడంతో సాగునీరు అందక ఆయకట్టు రైతులు ఇబ్బందిపడుతున్నారు.

4,116 ఎకరాల ఆయకట్టు..

ఈ ఎత్తిపోతల పథకం కింద జగ్గయ్యపేట మండలంలోని తక్కెళ్ళపాడు, రామచంద్రునిపేట, గరికపాడు, షేర్‌మహ్మద్‌పేట, గండ్రాయి, అనుమంచిపల్లి, బలుసుపాడు గ్రామాలతోపాటు వత్సవాయి మండలం దేచుపాలెం గ్రామాల పరిధిలో సుమారు 4116 ఎకరాల ఆయకట్టు ఉంది. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టుకు నాబార్డు నుంచి రూ.22.96 కోట్లు మంజూరుకాగా, నిర్మాణ బాధ్యతలను హైదరాబాద్‌కు చెందిన ఓ నిర్మాణ సంస్థ చేపట్టింది.

నత్తనడకన పనులు..

ఈ పథకం పనులు తొమ్మిదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. పాలేరు ఒడ్డున పంప్‌హౌస్, మూడు మోటార్ల నిర్మాణంతోపాటు పైప్‌లైన్ల ద్వారా సాగునీటిని అందించేందుకు 40 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం, 92 డెలివరీ బావులు నిర్మించాల్సి ఉండగా ఈ తొమ్మిదేళ్లలో ఇప్పటివరకు 50 డెలివరీ బావులను మాత్రమే నిర్మించారు. పైప్‌లైన్ పనులు కూడా పూర్తికాలేదు. పథకం పనుల్లో ఇప్పటివరకు 75శాతం మాత్రమే పూర్తికావడంతో మిగిలిన 25శాతం పనులు పూర్తికావడానికి ఇంక ఎన్నేళ్లు సమయం పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పథకం పనులు ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉండటంతో ఈ పథకం వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు నిరుపయోగంగా మిగలగా, కోట్లాది రూపాయల ప్రజాధనం వృధాగా మారింది. ఈ పథకానికి మంజూరైన నిధులను 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 'పసుపు-కుంకుమ' వంటి ఓట్ల కొనుగోలు పథకానికి వినియోగించదనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ పనుల్లో జాప్యమేర్పడిందనే చర్చ రాజకీయవర్గాల నుంచి వినిపిస్తోంది.

చెక్‌డ్యాం లేకుండా నీటి నిల్వ ఎలా?...

ఈ ఎత్తిపోతల పథకం నిర్మాణం విషయంలో టీడీపీ ప్రభుత్వం ముందుచూపు లేకుండా వ్యవహరించిందనే విమర్శలు ఉన్నాయి. చెక్‌డ్యాం లేకుండా ఎత్తిపోతల పథకం నిర్మిస్తే ఎటువంటి ప్రయోజన ఉండదని అప్పటి ఉన్నతస్థాయి ఇంజినీరింగ్ అధికారులు సూచించినప్పటికీ ఆ సూచనలను టీడీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని రైతులు విమర్శిస్తున్నారు. పాలేరు ఉపనది ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుగా ఉండటంతో ఈ పథకం ఏర్పాటుకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి అధ్వర్యంలో కోదాడ, నల్లబండగూడెం, రెడ్లకుంట గ్రామాల రైతులు అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఈ ఎత్తిపోతల పథకం పనులను అడ్డుకున్నారు. ఎట్టకేలకు ఏపీ-తెలంగాణ సర్వే అధికారులు ఈ ప్రాంతాన్ని సర్వే చేసి పాలేరు కొంతభాగంలోనే ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తామని పేర్కొన్న రాష్ట్రప్రభుత్వం ఆమేరకు పనులు చేపట్టింది. అయితే పాలేరుపై చెక్‌డ్యాం నిర్మాణం లేకుండా ఎత్తిపోతల పథకం నిర్మిస్తే ఎటువంటి ఉపయోగం ఉండదన్న ఇంజినీరింగ్ అధికారుల సూచనలను మాత్రం నాడు టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం.

చెక్‌డ్యాం ఉంటే పుష్కలంగా నీరు...

తక్కెళ్ళపాడు ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ సమీపంలో పాలేరుపై చెక్‌డ్యాం ఏర్పాటు చేస్తే నీరు పుష్కలంగా ఉండి ఆయకట్టు రైతులకు మేలు చేకూరుతుంది. అయితే చెక్ డ్యాం ఏర్పాటు చేయాలంటే తెలంగాణ ప్రభుత్వం సమ్మతించాల్సి ఉంటుంది. అప్పట్లో తెలంగాణలోని సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి, మనరాష్ట్రంలోని సీఎం చంద్రబాబు ప్రభుత్వానికి మధ్య సఖ్యత లేకపోవడం కూడా ఇక్కడ చెక్‌డ్యాం ఏర్పాటు ఈ పథకం డిజైన్‌లో లేకపోవడానికి మరో కారణమని చెప్పవచ్చు. దీంతో పాలేరులో వరదల సమయంలోనే నీరు పుష్కలంగా ఉంటోందని, మిగతా సమయాల్లో నీరు నిల్వ ఉండని దుస్థితి నెలకొంది. ఇటీవల ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ఈ పథకాన్ని పరిశీలించిన సమయంలో చెక్‌డ్యాం ఏర్పాటు అంశాన్ని రైతులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడతామని హామీ ఇచ్చారే తప్ప ఆదిశగా కూటమిప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యమనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి చెక్‌డ్యాం నిర్మాణంతో కూడిన ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పనులు పూర్తయ్యేలా చూస్తా..

నేను ఇటీవలే డీఈగా బాధ్యతలు తీసుకున్నాను. ఈ ఎత్తిపోతల పథకం గురించి పూర్తిగా అవగాహన పెంచుకోవాల్సి ఉంది. ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– చెన్నారెడ్డి, డీఈ, ఐడీసీ

బావులు, బోర్లు పైనే ఆధారం..



తక్కెళ్ళపాడు ఎత్తిపోతల పథకం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో వర్షం, బోర్లపై ఆధారపడే సాగు చేపట్టాల్సి వస్తోంది. సమీపంలోని తెలంగాణ నుంచి వచ్చే కాచవరం సాగర్ కాలువ కూడా ఎప్పుడు వస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. గతేడాది పాలేరుకు వరద రావడంతో రెండెకరాల పొలం పూర్తిగా కొట్టుకుపోయింది. ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితేనే ఆయకట్టు పరిధిలో సాగు సజావుగా సాగుతుంది.

– గురవయ్య, ఆయకట్టు రైతు

చెక్‌డ్యాం ఏర్పాటు చేయాలి...



పాలేరులో నీటి నిల్వ కోసం చెక్‌డ్యాం ఏర్పాటు చేస్తేనే ఈ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సార్థకత ఉంటుంది. చెక్‌డ్యాం లేకపోతే ఎటువంటి ఉపయోగం లేదు. వర్షాలు కూడా సకాలంలో కురవకపోతుండటంతో ఆయకట్టు రైతులు సీజన్ వచ్చిందంటేనే సాగునీటి కోసం ఎదురుచూడాల్సి దుస్థితి నెలకొంది. చెక్‌డ్యాంతో కూడిన ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతున్నాం.

–బజారు రవికుమార్, ఆయకట్టు రైతు

నేడు ఉచిత వైద్యశిబిరం

వత్సవాయి: జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో మక్కపేటలోని కల్యాణమండపంలో గురు, శుక్రవారాలలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకటనరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడంతోపాటు కళ్లజోళ్లను అందిస్తామన్నారు. బీపీ, షుగర్, గుండె, నరాలు తదితర జబ్బులను పరీక్షించి ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. వైద్యశిబిరంలో పాల్గొనే వారు తమ ఆధార్‌కార్డును వెంట తీసుకొని రావాలని సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎమ్మెల్యే

నందిగామటౌన్: నందిగామ పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్ వద్ద రూ.15లక్షలతో చేపట్టిన కాలువ పూడికతీత పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, పట్టణాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు, నాయకులు మండవ శ్రీనివాసరావు, శ్రీనివాసాచారి, మారం అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నందిగామ రూరల్: మైలవరం పంచాయతీ కార్మికురాలు భవానీపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడు కటారి ఉమామహేశ్వరరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామిక మహిళా జిల్లా కోకన్వీనర్ ఎస్‌సిహెచ్ సుప్రజ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులపై దాడిని ఖండించారు. దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేడు నందిగామ కౌన్సిల్ అత్యవసర సమావేశం

నందిగామటౌన్: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి అధ్యక్షతన గురువారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ లోవరాజు తెలిపారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్ సభ్యులంతా హాజరుకావాలని కమిషనర్ కోరారు.

ప్రజలను మోసగించిన ఘనత చంద్రబాబుదే



పోలంపల్లిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న తన్నీరు, నాయకులు



రాఘవాపురంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గయ్యపేట: మండలంలోని ధర్మవరప్పాడుతండ, జయంతిపురం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల పేరుతో పేదల జీవితాలను మార్చుతామని అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు ఆహామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పాలకులు చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆపార్టీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు, నాయకులు చల్లా సుశీల, శ్యామల, మాడావత్ నరసింహ, భూక్యా జ్వాలా, బాణావత్ రాజునాయక్, పాండు, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

వత్సవాయి: మండలంలోని పోలంపల్లి, గంగవల్లి, పోచవరం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నికలలో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేయగా, కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు గుత్తా శంకరారావు, వైస్ ఎంపీపీ కాటేపల్లి రామలక్ష్మి, మాజీ సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవి, సర్పంచులు మాడుగుల లాజర్, కొట్టె నగేష్, లేళ్ల హరికృష్ణారెడ్డి, లేళ్ల నాగేంద్రరెడ్డి, రూప్లానాయక్, యేశపోగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి విమర్శించారు. మండలంలోని బోడవాడ, జమ్మవరం, తాటిగుమ్మి గ్రామాలలో బుధవారం రాత్రి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ ' గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించారు. క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించి, సీఎం చంద్రబాబు మోసాలపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. రైతు విభాగం నాయకుడు నువ్వుల విశ్వనాథం, సర్పంచ్‌లు శీలం సంధ్య, పలకా మోహన్‌రెడ్డి, నాయకులు కర్ల రాజు, జంగా వెంకట రామిరెడ్డి, జంగా వెంకటరామిరెడ్డి, పెనుమూరి బాబురావు, శీలం భాస్కర్‌రెడ్డి, డోర్నాల రవి తదితరులు పాల్గొన్నారు.

నందిగామరూరల్: సీఎం చంద్రబాబు అంటేనే మోసమని రాష్ట్ర ప్రజలకు మరోసారి తేటతెల్లమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్ విమర్శించారు. మండలంలోని రాఘవాపురం, కమ్మవారిపాలెం గ్రామాల్లో బుధవారం రాత్రి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ఉన్మాద రాజకీయాలు సాగుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.కార్యక్రమంలో సర్పంచ్ పెసరమల్లి సురేష్, నాయకులు చిలుకూరి బుచ్చిరెడ్డి, స్టాలిన్, నూణావత్ స్వామి నాయక్, గాడిపర్తి రామకృష్ణ, నెలకుదిటి మహేష్, సంపసాల రాంబాబు, పరిమి శ్యామ్యూల్, వెంకటేశ్వరరావు, రామకోటేశ్వరరావు, కుమారి, మరియమ్మ, సత్యనారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీల రద్దుకు డిమాండ్

వత్సవాయి: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎంఆధ్వర్యంలో బుధవారం వత్సవాయిలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆగస్టు 5న ధర్నా చేయనున్నటు తెలిపారు. ఆపార్టీ జిల్లా నాయకుడు సీహెచ్ హనుమంతురావు, సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, నాయకులు కె.వెంకటేశ్వర్లు, బి.పుల్లయ్య, వై వెంకటరత్నం, పుల్లయ్య, శివయయ, సురేష్ పాల్గొన్నారు.

ఎస్సీలకు అన్యాయం చేయడం తగదు : చిన్నా

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్ పోస్టు ఎస్సీ మహిళకు రిజర్వుకాగా, కూటమి నేతలు ఆ పదవి వారికి దక్కకుండా అడ్డుపడుతుండటం సమంజసం కాదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా) బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 45ఏళ్లుగా ఇక్కడ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అనేక పదవులు అనుభవించిన కూటమి నేతలైన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను..ఇన్నేళ్లు వారి గెలుపుకోసం కృషిచేసిన ఎస్సీలకు మాత్రం ఈసారి ఏఎంసీ చైర్మన్ పదవి దక్కకుండా చేస్తున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నామినేటెడ్ పదవుల్లోనూ రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణం ఎస్సీలకు కేటాయించిన జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్ పదవి వారికే దక్కేలా చూడాలని కూటమి నేతలను ఆయన డిమాండ్ చేశారు.

ప్రజాచైతన్యంతోనే మానవ అక్రమ రవాణాకు చెక్

నందిగామ ప్రిన్సిపల్ జడ్జి రియాజ్



మాట్లాడుతున్న న్యాయమూర్తి రియాజ్

నందిగామరూరల్: మానవ అక్రమ రవాణా కార్యకలాపాలు ప్రపంచానికి పెనుసవాలుగా మారుతున్నా యని నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కెవీఆర్ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి రియాజ్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తేనే మానవ అక్రమ రవాణాను అరికట్టగలమన్నారు. ప్రజల హక్కులను పరిరక్షించ డ, శ్రమ, లైంగిక దోపిడీకి గురవుతున్న వారిని గుర్తించి రక్షించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాయప్ప, న్యాయవాదులు అద్దంకి మణిబాబు, మట్టా ప్రసాద్, బొందలపాటి రామకృష్ణ, గుర్రాల వెంకటరత్నం, యరగొర్ల రామారావు, కొమ్మినేని మాలేశ్వరరావు, వేల్పుల ప్రభాకరరావు, విద్యార్థులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

టీచర్లకు డీఏ బకాయిలు చెల్లించాలి : యూటీఎఫ్



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

పెనుగంచిప్రోలు: టీచర్లకు రాష్ట్రప్రభుత్వం బకాయిపడిన డీఏలను వెంటనే చెల్లించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదును బుధవారం పెనుగంచిప్రోలు మండలంలో ప్రారంభించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు మన్నేపల్లి కృష్ణ మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులకు తక్షణమే పొజిషన్ ఐడీలను పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సంపాదిత సెలవుల నగదు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. టీచర్లకు పీ4 దత్తత కార్యక్రమాన్ని విరమించాలన్నారు. ఉద్యోగులపై మోపిన యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు పి లీల, జిలా కార్యదర్శి ప్రైమర్, మండల కార్యవర్గ సభ్యులు చాగర్లి రామారావు, దైద దానయ్య, జామా మోహనరావు, బిట్ట వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు

నందిగామ రూరల్: మహిళలు, చిన్నారులు, యువతుల భద్రతకు ప్రభుత్వంతో పాటు పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎస్ఐ అభిమన్యు పేర్కొన్నారు. ర్యాగింగ్, లైంగిక వేధింపులు, మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలు, శక్తి యాప్ తదితర అంశాలపై పట్టణంలోని పల్లొట్టి గ్లోబల్ స్కూల్, గిరిజన బాలికల వసతి గృహంలోని విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థునులు అప్రమత్తంగా ఉండటంతో పాటు అవసరమైన సమయంలో ధైర్యాన్ని ప్రదర్శించాలన్నారు. ముఖ్యంగా గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో 100, 112, శక్తి మొబైల్ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందిస్తే తగిన రక్షణ చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో శక్తి టీం ఏఎస్ఐ హనుమయ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్ దృష్టికి ప్రజాసమస్యలు



మాట్లాడుతున్న చైర్మన్ రాఘవేంద్ర, హాజరైన కౌన్సిల్ సభ్యులు

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఇంజినీరింగ్, శానిటరీ కార్మికుల వేతనాలను రూ.26వేలకు పెంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వట్టెం మనోహర్ చేసిన ప్రతిపాదనను మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర అంగీకరించగా, టీడీపీ కౌన్సిలర్ వెంకట్ మాత్రం ఆ ప్రతిపాదనను వ్యతిరేకించారు. ఓ పదిరోజులు ధర్నా చేసినంత మాత్రాన జీతాలు పెంచాలా అని వ్యాఖ్యానించారు. మనోహర్ మాట్లాడుతూ ఉక్కు కళావేదిక, స్కిల్ డెవలప్‌మెంట్ కమ్యూనిటీ హాళ్ల అద్దె లీజుకు టెండర్లు పిలువకపోవడంతో మున్సిపాలిటీ అద్దె కోల్పోతుందని పేర్కొన్నారు. అనధికార వ్యక్తులు, టీడీపీ నాయకులు స్కిల్ డెవలప్‌మెంట్ కమ్యూనిటీ భవన్‌ను వారి రాజకీయ అవసరాల కోసం వినియోగిస్తున్నారని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. వైస్‌చైర్‌పర్సన్ హఫీజున్నీసా మాట్లాడుతూ చెరువు పక్కన సిమెంటు రోడ్డు నిర్మాణం కాంటాక్టు దక్కించుకున్న వ్యక్తి మృతిచెందినందున మళ్లీ టెండర్లు పిలిచి రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. బలుసుపాడురోడ్‌లోని బాలికల గురుకుల పాఠశాల వరకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, కనకదుర్గమ్మ గుడి వెనుక బోరుపంపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కబేళాలో ఆక్రమణలను తొలగించి అభివృద్ధి చేయాలంటూ కౌన్సిల్ సభ్యులు కోరారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్ తులసి కృష్ణారావు పాల్గొన్నారు.